ఈ న్యూస్
హైదారాబాద్ enews digital channel
శుక్రవారం 27.06.2025
ఎడిటోరియల్


# టూవీలర్లకు టోల్ ఫీజు.. క్లారిటీ ఇచ్చిన నితిన్ గడ్కరీ



ఈ న్యూస్: జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించిదంటూ వచ్చిన వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. జులై 15 నుంచే అమల్లోకి తీసుకురానున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టంచేశారు. టూవీలర్లకు టోల్ వసూలు చేసే ఉద్దేశమేదీ లేదని పేర్కొన్నారు. కొన్ని మీడియా సంస్థలు ద్విచక్ర వాహనాలపై టోల్ పన్ను విధించడం గురించి తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని తప్పుబట్టారు. టోల్ పన్నుపై పూర్తి మినహాయింపు కొనసాగుతుందని చెప్పారు. వాస్తవాలు తెలీకుండా తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఏఐ కూడా ఇదే తరహా ప్రకటన విడుదల చేసింది. టోల్ ఫీజు ప్రతిపాదనేదీ లేదని స్పష్టంచేసింది.

# దేశ రక్షణ మరింత బలోపేతం

27.06.2025

ఈ సంపాదకీయం

**రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అనేక దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత పెంచుకునేందుకు సిద్ధం అవుతున్నాయి.**

**2016 భారత్- రష్యా మధ్య రూ. 21,000 కోట్ల రక్షణ రంగ డీల్ కుదిరింది. హిందూ మహా సముద్రంలో గస్తీని పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు ఈ మేరకు రష్యాతో భారత్ కీలక ఒప్పందం చేసుకుంది.**

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు తమ రక్షణ రంగాన్ని బలోపేతం చేసుకునే పనిలో పడ్డాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అనేక దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత పెంచుకునేందుకు సిద్ధం అవుతున్నాయి. ఇక భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాలతో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. భారత నేవీ రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు రంగం సిద్ధం చేసింది. మోస్ట్ అడ్వాన్స్‌డ్ స్టీల్త్ ఫ్రిగేట్ రంగానికి చెందిన INS తమాల్ యుద్ధ నౌక సేవలను ప్రారంభించనుంది. జులై 1, 2025 నుంచి ఈ యుద్ధ నౌక గస్తీ నిర్వహించనుంది. భారత నేవీ రంగంలో కీలక ముందడుగు పడింది. అత్యాధునిక స్టీల్త్ ఫ్రిగేట్ రంగానికి చెందిన INS తమాల్ యుద్ధ నౌక భారత అమ్ముల పొదిలో చేరనుంది. జులై 1, 2025 నుంచి ఈ యుద్ధ నౌక సేవలు ప్రారంభించనుంది. ఈ యుద్ధ నౌకను రష్యా అభివృద్ధి చేసింది. భారత్- రష్యా ఒప్పందంలో భాగంగా రష్యాలోని యాంతార్ షిప్ యార్డ్ లో ఈ నౌక నిర్మాణం జరిగింది. 2016 భారత్- రష్యా మధ్య రూ. 21,000 కోట్ల రక్షణ రంగ డీల్ కుదిరింది. హిందూ మహా సముద్రంలో గస్తీని పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు ఈ మేరకు రష్యాతో భారత్ కీలక ఒప్పందం చేసుకుంది. డీల్ లో భాగంగా రష్యా భారత్ కు ఈ INS తమాల్ సిరీస్ కు చెందిన యుద్ధ నౌకలను నిర్మించి అందించింది. జులై 1 నుంచి ఈ యుద్ధ నౌక గస్తీ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. వైస్ అడ్మిరల్ సంజయ్ జే సింగ్ ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. INS తమాల్ యుద్ధ నౌక భారత నౌకాదళానికి చెందిన తల్వార్ -క్లాస్ ఫ్రిగేట్. ఇది తల్వార్-క్లాస్ ఫ్రిగేట్ విభాగంలో ఎనిమిదో నౌక. అంతేకాక భారత నేవీ.. రష్యా నుంచి ఆర్డర్ చేసిన క్లాస్ ఫ్రిగేట్ లో మూడో బ్యాచ్ లో రెండోది. రష్యా కాలినిన్ గ్రాడ్ లోని యాంతార్ షిప్ యార్డ్ ఈ నౌకను నిర్మించింది. ఈ నౌక భారత నావికాదళం దిగుమతి చేసుకున్న చివరి యుద్ధనౌక కావడం విశేషం. అంతకుముందు డిసెంబర్ 2024లో INS తుషీల్ ను రష్యా అప్పగించింది.

## సంపాదకీయం

### పశ్చిమాసియా యుద్ధంలో గెలుపెవరిది ?




ఇజ్రాయెల్ దాడులను ఆపితే ప్రతి దాడులు కొనసాగించమంటూ కాల్పుల విరమణకు సుముఖమనే అభిప్రాయాన్ని తెలిపింది. కాల్పుల విరమణపై ట్రంప్ పోస్టు పెట్టిన కొన్ని గంటల తర్వాత అబ్బాస్ అరాగ్చీ వెంటవెంటనే రెండు విభిన్న పోస్టులు చేశారు. ఈ పరస్పర విరుద్ధమైన ప్రకటనలతో కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి నిన్న రాత్రి వరకు ఇజ్రాయెల్ గానీ, ఇరాన్ అధికారులు గానీ ఎలాంటి ఒప్పందాన్ని బహిరంగంగా అంగీకరించలేదు. వైట్ హౌస్, పెంటగాన్ కూడా అధికారిక ప్రకటనలు విడుదల చేయలేదు. ఈ ఒప్పందం దౌత్య మార్గాల ద్వారా తెలియజేశారా? లేదా? అనేది అస్పష్టంగా ఉంది. అలాగే ఇరు పక్షాలు ఈ నిబంధనలను పాటించడానికి సిద్ధంగా ఉన్నాయా? అనే దానిపై కూడా స్పష్టత లేదు. దీంతో అంతర్జాతీయంగా ఈ పరిణామంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొత్తంగా ట్రంప్ సీజ్ ఫైర్ ప్రకటన తర్వాత ఇరాన్ అడ్డం తిరిగి ట్రంప్ పరువును బజారు కీడ్చింది. మొత్తంగా ప్రపంచ పెద్దన్నగా చెప్పే అమెరికా మాటలకు ప్రస్తుతం విలువ లేకుండా పోయింది. గతంలో మాదిరి అమెరికా మాటలు వినే దేశాలు లేవనే విషయం స్పష్టమైంది. అమెరికా కూడా పాకిస్థాన్ వంటి ఉగ్ర దేశాలతో స్నేహం చేస్తూ.. దాన్ని భారత్ ను సరిసమానంగా చూడడాన్ని ఎవరు హర్షించడం లేదు. ఓ వైపు ప్రపంచ ఉగ్రవాదానికి వ్యతిరేకం అంటూ చెప్పుకునే అమెరికా.. పాకిస్థాన్ ను అండగా నిలవడం .. ఆపై ప్రపంచ బ్యాంక్ నుంచి దానికి రుణాలు ఇప్పించి ఇప్పటికీ ఆ దేశాన్ని బతికిస్తోంది. పాకిస్థాన్ కూడా గల్ఫ్ తో పాటు మిడిల్ ఈస్ట్ దేశాలకు మధ్యన ఉండటం మూలానా..తన సైనిక ప్రాబల్యాన్ని పెంచుకోవడం కోసం పాక్ కు అంటకాగుతుంది. మొత్తంగా భారత ప్రభుత్వం కూడా అమెరికా ఈ రెండు నాల్కల ధోరణిని తప్పుపెట్టింది. మొత్తంగా అమెరికా .. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం జరిగిందంటూ చెప్పిన కొన్ని గంటలకే ఇరాన్ అడ్డం తిరగడం బహుశా ట్రంప్ కూడా ఊహించి ఉండడు. మొత్తంగా ప్రపంచ శాంతి దూతగా పేరు తెచ్చుకోవాలనే ఆరాటంలో తాను దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని చెప్పుకోవడానికే ట్రంప్ ఈ పనులు చేస్తున్నాడంటూ ఆ దేశ వాసులే చెప్పుకుంటున్నారు. మొత్తంగా చూసుకుంటే.. ఈ విషయంలో ఇరాన్.. ట్రంప్ ను బఫూన్ గా చేసి ప్రపంచ ముందు నిలబెట్టిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.



దేశ రక్షణ కేవలం సైనికుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యమే. అవినీతి లేకుండా, చట్టాల పట్ల గౌరవంతో, సామాజిక అభివృద్ధికి తోడ్పడి, దేశాన్ని బలంగా నిలపాలి. భద్రత, సమృద్ధి, శాంతి కోసం ప్రతి ఒక్కరూ తమ పాత్రను నిబద్ధతతో నిర్వర్తించాలి. దేశం మనం, మన బాధ్యతా కూడా మనదే.

- సఫీఉల్లా పర్వాజ్
ఎడిటర్ ' ఈ న్యూస్ '

## పాక్‌కు అడ్డుకట్ట

# 'తుల్‌బుల్' పునరుద్ధరణకు భారత్ సై!



పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు గాను సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పశ్చిమ నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు. సింధూ జలాల ఒప్పందం ప్రకారం పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. భారత్, పాక్ మధ్య 1960, సెప్టెంబరు 19న జరిగిన ఒప్పందం ప్రకారం ఈ నదీవ్యవస్థ మొత్తం నీటిలో 20% భారతదేశం, 80% పాకిస్థాన్ వినియోగించుకోవాలి. అయితే, మన దగ్గర వీటి నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం సవాలుగా మారింది. డ్రై సీజన్‌లో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ.. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. దీంతో అధిక నీరు వస్తే అది దిగువన పాకిస్థాన్‌కే పోతోందని సంబంధిత అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా ఒప్పందం అమలు వల్ల వరదల సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవన్నారు. కానీ, ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించామన్నారు. గతంలో పాక్ వ్యతిరేకించిన కిషన్‌గంగా ఇప్పటికే పూర్తికాగా.. రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని చెప్పారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం



ఈ న్యూస్ వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి (పొన్నం ఆంజనేయులు గౌడ్): స్థానిక ఎన్నికలు నిర్వహించడం చేతకాక ఎన్నికలు నిర్వహించడం లేదని తెరాస సీనియర్ నాయకులు మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణాగౌడ్ విమర్శించారు ఈ న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో గెలపొందాలనే ఉద్దేశంతోనే నెరవేర్చలేని హామీలను చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అభివృద్ధి చెందుతుందిఅనే ఆశను నిరసనృతులలో నిమగ్నంగా భగ్నం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్పబోతున్నారని ఆయన జోష్యం చెప్పారు. ఇచ్చినటువంటి ఆరు హామీలలో హామీలు హామీలు గానే ఉన్నాయని గత పది సంవత్సరాలలో బీ ఆర్ఎస్ పరిపాలనలో రైతులు పండించుకున్నట్టు వంటి పంటకు ఇబ్బందులను కలగకుండా సరియైన సమయాలలో రైతుల బ్యాంకు ఖాతాలో ఘనత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావే నాని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో ఈ నెలలోనే రైతు భరోసా రైతులందరికీ వేశారు అంటే అర్థం ఏమిటంటే స్థానిక సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అతి త్వరగా రైతు ఖాతాలో పంట పెట్టుబడి వేశారే తప్ప తెలంగాణ రాష్ట్ర రైతుల వేయలేదని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతుందన్నారు.

ఈ న్యూస్
హైదారాబాద్ enews digital channel
శుక్రవారం 27.06.2025
ఉమ్మడి వార్తలు


## 33/11 కె.వి రాజపల్లె సబ్ స్టేషన్ లో నూతన లైను ప్రారంభం



ఈ న్యూస్, హుజురాబాద్ రూరల్ : హుజురాబాద్ డివిజన్ రూలర్ సెక్షన్ లో గల రాజపల్లి 33/11 కె.వి సబ్ స్టేషన్ లో ఇంటర్ లింకు సిస్టం 33/11 కెవి లైన్లు నూతనంగా ఎస్.ఈ మేక రమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ నూతన లైను ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఎక్కడైతే 11 కెవి క్రాస్ లైన్స్ లోలెన్త్ పోల్స్ ఉన్నాయో వాటిని తొలగించి నూతన పోల్స్ వేసి ఎత్తు పెంచాలని సూచించారు. దీనివలన ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలియజేశారు. ఓ&ఎం స్టాఫ్ కు భద్రత సూచనలు పాటించాలని తప్పకుండా ఎర్త్ రాడ్స్ వాడాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ. టెక్నికల్ ఉపేందర్. హుజురాబాద్ ఆపరేషన్ డి.ఇ. లక్ష్మారెడ్డి, కన్స్ట్రక్షన్ డి.ఇ చంద్రమౌళి, జమ్మికుంట ఏ.డి ఈ. రాజేందర్, హుజురాబాద్ రూలర్ ఏ.ఈ జనార్ధన్, కన్స్ట్రక్షన్ ఏ.ఈ. భోగం రవీందర్, ఏ.ఈ. సంతోష్, ఓ&ఎం లైన్మెన్ ఐలేష్, కనకయ్య, వెంకటేశ్వర్లు, శరత్ రెడ్డి పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నియోజవర్గంలో పల్లు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్న రాష్ట్ర మంత్రులు



ఈ న్యూస్, హుస్నాబాద్ (స్టేట్ బ్యూరో రాఘవుల శ్రీనివాసు) : అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జంగపెల్లి ఐలయ్య మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహమ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉదయం బస్వాపూర్ గ్రామంనికి చేరుకోవాలని, బస్వాపూర్ గ్రామం నుండి రాష్ట్ర మంత్రులకు స్వాగతం పలకాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు. అనంతరం హుస్నాబాద్ నియోజవర్గం పల్లు అభివృద్ధి కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు. 11 గంటలకు హుస్నాబాద్ లో నూతనంగా 1 కోట్ల 50 లక్షలు నూతనంగా నిర్మిస్తున్న మాత శిశు ఆరోగ్యం కేంద్రం, 11:30 నిమిషాలకు 82కోట్లతో 250 పడకల వైద్యశాలను శంకుస్థాపన, 12 గంటలకు 77 కోట్ల 20 లక్షల రూపాయలతో కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు 4 వరుసల రహదారిని శంకుస్థాపన, అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజలతో 12.30 నిమిషాలకు బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలుపుతూ ఇట్టి బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్న విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బుర్ర ప్రభాకర్, బండి కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు త్రిమూర్తి, భైరవని శ్రీనివాస్ మాజీ సర్పంచ్ ముత్యాల సంజయ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల్లు పంద్రాల దాము, తిరుపతి నాయక్, రాంబాబు నాయక్, బద్దం రాజిరెడ్డి, భాస్కర్ నాయక్, పంగ రాకేష్, మేక రమేష్, బెజ్జంకి సారయ్య, వల్లపు పరశురాములు, రాజిరెడ్డి రమణాచారి, సంపత్ రెడ్డి, అశో.క్ గంగారపు అనిల్, అనుముల నాగరాజ్, తాళ్ల ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారం టెంట్ హౌస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఈ న్యూస్, జన్నారం (మదిరె సతీష్) జన్నారం మండల టెంట్ హౌస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతన అధ్యక్షుడిగా జన్నారం పట్టణానికి చెందిన పర్ల శంకర్, గౌరవ అధ్యక్షులుగా, మెంగని సదన్న, ప్రధాన కార్యదర్శి, ముంజంపల్లి సాయి కుమార్, కోశాధికారిగా, నిమిషకవి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కందుల రాజేందర్, సామల్ల లక్ష్మీ రాజం, ప్రచార కార్యదర్శులుగా, సంగ అంజిత్, తాటి రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ సంఘం అభివృద్ధికి తోడ్పడతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జన్నారం మండల టెంట్ హౌస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన వ్యవసాయ శాఖ అధికారులు



ఈ న్యూస్, హుజురాబాద్ (స్టేట్ బ్యూరో రాఘవుల శ్రీనివాసు) : హుజురాబాద్ మండలములో సిర్సపల్లి, ధర్మరాజుపల్లి, కందుగుల మరియు చెల్పూర్ గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులతో వానాకాలము సీజన్ కి సంబంధించి ఎరువుల విత్తనాల పురుగు మందుల నిల్వలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపినారు. అందరు డీలర్లు కాలం చెల్లిన విత్తనాలు మరియు కాలం చెల్లిన పురుగు మందులు, నిషేధిత పురుగు మందులు అమ్మకూడదని అన్నారు. అలాగే తమ రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ స్టాక్ రిజిస్టర్లను రోజు వారిగా రాయాలని సూచించారు. పిఓఎస్ (PoS) మిషిన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలని, భౌతికనిల్వలు పిఓఎస్ మిషిన్ లోని నిలువలతో తప్పక సరిచూసుకోవాలని సూచించినారు. షాపు యొక్క మెయిన్ బోర్డు పైన డోర్ నెంబర్ మరియు లైసెన్స్ యొక్క వివరాలు తప్పక పొందుపరచాలన్నారు. అధీకృత లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయకూడదని మరియు రెన్యువల్ చేయించుకొనుటకు తగినంత ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విత్తన ఎరువులు క్రిమిసంహారక మందులకు స్టాక్ బోర్డులు విడివిడిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందులను విడివిడిగా పొందుపరచుకోవాలన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన వోడితల ప్రణవ్



ఈ న్యూస్ జమ్మికుంట రూలర్ రిపోర్టర్ (ఇమ్మడి రాజు): జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో కాంగ్రెస్ యువజన నాయకుడు జగన్ తండ్రి ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా పెద్దంపల్లి గ్రామంలో కాంగ్రెస్ యూత్ నాయకుడు ఎడ్ల రాజు అత్తమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబ సభ్యులను మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కుటుంబాలకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, కాంగ్రెస్ నాయకులు దేశినీ కోటి, సుంకరి రమేష్, గూడెం సారంగపాణి, పొనగంటి మల్లయ్య, ఎక్కేటి సంజీవరెడ్డి, రాచపల్లి సదయ్య, తిరుపతి రెడ్డి పోశెట్టి,రాజు ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందనపల్లి నూతన ఎఫ్.ఆర్.ఓ. శ్రీధర చారి నియామకం

ఈ న్యూస్, జన్నారం (మదిరె సతీష్): ఇంధన్ పల్లి నూతన ఎఫ్ ఆర్ వో గా శ్రీధరా చారి నియామకం, కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోగల జన్నారం అటవీ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా శ్రీధరాచారి నియమిస్తూ తెలంగాణ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణ ఉత్తర్వులు జారీ చేశారు ఇదివరకు ఇంధన్ పెళ్లి ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా మంచిర్యాల జిల్లా అటవీ టాస్క్ ఫోర్స్ అధికారి కారం శ్రీనివాస్ విధులు నిర్వహించారు అతని స్థానంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం మోతుగూడ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి శ్రీదరాచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది



మతమార్పిడి నిరోధక చట్టం కింద నమోదైన కేసులో ఏప్రిల్ 29న బెయిల్ పొందిన నిందితుడిని విడుదల చేయడంలో జాప్యం చేసినందుకు సుప్రీంకోర్టు బుధవారం యూపీ ప్రభుత్వాన్ని విమర్శించింది. నిందితుడికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. స్వేచ్ఛ అనేది రాజ్యాంగం ప్రకారం హామీ ఇచ్చిన చాలా విలువైన హక్కు అని కోర్టు పేర్కొంది.



## ప్రైవేటు పాఠశాలలపై ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటుకు డిమాండ్

ఈ న్యూస్ – మునగాల: (రిపోర్టర్: తోకల సైదులు): హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. వి. నవీన్ నికోలస్‌ను మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు జిల్లేపల్లి దుర్గాప్రసాద్ బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలలలో తగిన నియంత్రణ లేకుండా ట్యూషన్ ఫీజుల పేరిట జరుగుతున్న దోపిడీపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం రిజర్వేషన్ అమలు విషయంలో తెలంగాణలో కూడా ఆంధ్రప్రదేశ్ మాదిరిగా నోటిఫికేషన్ విడుదల చేసి విద్యా హక్కును విద్యార్థులకు చేరువ చేయాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకొని, ఫీజులు సామాజిక న్యాయానికి అనుగుణంగా నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న పుస్తకాలనే ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పనిసరిగా అమలు చేయాలని, పిల్లలపై ఆర్థిక భారం తగ్గించాలన్నారు. అంతేగాక, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ఎల్కేజీ, యూకేజీ, నర్సరీ తరగతులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇవి ప్రవేశపెట్టకుండా ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే వీలు కల్పించడం వల్లనే వేల రూపాయల ఫీజులు దోపిడీకి దారితీస్తోందని తెలిపారు.



ప్రాంతీయం

## బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ఈ న్యూస్, హుజురాబాద్ (స్టేట్ బ్యూరో రాఘవుల శ్రీనివాసు) : హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద కరీంనగర్ వైపు నుండి వస్తున్న హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఓ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీ కొట్టింది. మెట్టుపల్లి కి చెందిన సూరం శ్రీనివాస్ తో పాటు మరో వ్యక్తి బైక్ పై హుజురాబాద్ వస్తుండగా జూనియర్ కాలేజీ మలుపు వద్ద ఈ సంఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం బస్సు డ్రైవర్ అతివేగంగా నడపడం వలన, బస్సు ఢీకొన్న వెంటనే రోడ్డు పక్కకు బురదలో పడిపోయినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ఇరువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు.








## మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలి: ఎంఈఓ యాదగిరి





ఈ న్యూస్, వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి (పొన్నం ఆంజనేయులు గౌడ్): వెల్దుర్తి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఎంఈఓ అరికల యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత గంజాయి, మత్తుపదార్థాల వల్ల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ మద్యం, మత్తుపదార్థాల వల్ల కుటుంబాలు వీధికి చేరుతున్నాయని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగేశ్వరి, దేవలత, గౌసియా బేగం, దుర్గ, నాగమణి, వెంకటస్వామి, నర్సింహా రెడ్డి, చార్లెస్, జయసుధ, శైలజ, అర్చన, నవనీత, సునీత, పద్మజ పాల్గొన్నారు.

## "మత్తుకు బానిసైన యువత" పై ఎస్సే రైటింగ్ పోటీలు విద్యార్థులకు బహుమతులు

ఈ న్యూస్ హుజురాబాద్ (స్టేట్ బ్యూరో రాఘవుల శ్రీనివాసు): హుజురాబాద్ మండల పరిధిలోని హుజురాబాద్ గర్ల్స్ హైస్కూల్ మరియు చెల్పూర్ హైస్కూల్ నందు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం ఆదేశాల మేరకు హుజురాబాద్ టౌన్ సిఐ కరుణాకర్ విద్యార్థులకు యువత డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు బానిసై చెడు మార్గాన పయనిస్తున్న అంశాలపై అవగాహన కలిగించే విధంగా ఎస్సే రైటింగ్ నిర్వహించారు. ఎస్సే రైటింగ్లో హుజురాబాద్ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ నందు ఎల్ లక్ష్మీ ప్రసన్న కు ప్రతిమ బహుమతి, చెల్పూర్ హైస్కూల్ చదువుతున్న రాంపూర్ చెందిన గట్టు హరిణికి ద్వితీయ బహుమతి, చెల్పూర్ హైస్కూల్ నందు




చదువుతున్న ఏదులాపురం శృతి కి తృతీయ బహుమతిని కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్ లో కరీంనగర్ కలెక్టర్ మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్ కరీంనగర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హుజురాబాద్ కరుణాకర్ వారిని అభినందించారు.

## లోన్ యాప్ల భారం తో యువకుడు ఆత్మహత్య

ఈ న్యూస్ ఇల్లంతకుంట: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ అఖిలేష్ (22) ఆర్థిక ఒత్తిడితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బీటెక్ పూర్తి చేసిన అతడు కాలేజ్ రోజుల్లోనే స్నేహితుల దగ్గర అప్పులు చేసి, తరువాత లోన్ యాప్ల ద్వారా డబ్బులు తీసుకున్నాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై, గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకున్నాడు. తండ్రి గుత్తికొండ రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.





ఇరాన్, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ తర్వాత, బీరుట్లోని దహియేలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ను ఎగతాళి చేస్తూ, ఇటీవలి వివాదంలో ఇరాన్ విజయాన్ని ప్రకటిస్తూ ఒక బ్యానర్ను ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్లో ట్రంప్ మోకాళ్లపై ఉండి ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ ముందు వేడుకుంటున్నట్లు కనిపించింది. అయితే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణను ప్రకటించిన కొద్దిసేపటికే దానిని ఇరు దేశాలు ఉల్లంఘించాయి.

## పాత్రికేయుల సమస్యలపై ఐక్య పోరాటం

ఈ న్యూస్, మహబూబ్ నగర్: ఇండ్ల సమస్యలపై మహబూబ్ నగర్ జిల్లాలో జర్నలిస్టులు ఐక్యంగా పోరాటం చేస్తున్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల నాలుగో రోజు పత్రికల బ్యూరోలు, టీవీ చానళ్లు, సోషల్ మీడియా జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు దీక్షకు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వాకిట అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయకుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్ చారి, కార్యదర్శి నరేందర్ గౌడ్, బీసీ జెఎసి నేత మైత్రి యాదయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, మాల చైతన్య సంఘం మూలె కేశవులు పాల్గొన్నారు. సాక్షి కిషోర్ గౌడ్, ఆంధ్రజ్యోతి రవీందర్ రెడ్డి, సూర్య శివకుమార్, వెలుగు అక్కల ధరణి, అహద్ షాబుద్దీన్, జాఫర్, మొహమ్మద్ రఫీ, ఉమామహేశ్వరరావు, గోపాల్, పసుపుల శ్రీనివాస్, కటిక రవీందర్, జక్కా గోపాల్, గోపాలకృష్ణ, పల్లె మౌని యాదయ్య, రామకృష్ణ, అనిల్ కుమార్, బాలు, రాఘవేందర్, దిలీప్ కుమార్, రామ్ కొండ, మోహన్ దాస్, భాస్కరాచారి, సతీష్ కుమార్, రవి, రవీందర్ గౌడ్, సత్య ప్రకాష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పత్రికల బ్యూరో ఇన్చార్జ్‌లు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఒకతాటిపైకి రావడం, భవిష్యత్ కార్యాచరణలో భాగస్వామ్యం కావడం హర్షణీయమని నాయకులు తెలిపారు. కేటాయించిన ఇండ్ల విషయంలో అధికారులు ఆలస్యం చేస్తుండటంతో దీక్షలు కొనసాగిస్తున్నామని తెలిపారు.



